సాక్షి చిత్తూరు

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



ప్రజాస్వామ్యానికి కూటమి ఘోరీ

అధికారంలోకి వచ్చింది మొదలు దౌర్జన్యం, దాడులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వెళ్తోందని నారాయణస్వామి మండిపడ్డారు. - 8లో



కమిషనర్ పచ్చపాతం

చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను వివాదాస్పదం చేశారు. - 8లో



చిన్నారుల పరిరక్షణే ధ్యేయం

చిన్నారుల పరిరక్షణే ధ్యేయంగా ముందడుకు వేస్తామని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

– పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తల్లిపాలు అన్నింటికన్నా శ్రేయస్కరమని, పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వారోత్సవాల్లో అవగాహన కల్పించాలన్నారు. 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, జిల్లా ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, డాక్టర్ జానకి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మలేరియా అధికారిగా అనిల్



చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా మలేరియా అధికారిగా డాక్టర్ అనిల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ స్థానంలో పనిచేస్తున్న శ్రీనివాసులు ఉద్యోగ విరమణ పొందడంతో ఐడీఎస్‌పీ నోడల్ ఆఫీసర్ అనిల్‌కు బాధ్యతలు అప్పగించినట్లు జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతిదేవి తెలిపారు.

జిల్లాలో రేషన్ పంపిణీ 6.6 శాతం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో వ్యాప్తంగా రేషన్ పంపిణీ గురువారం నుంచి ప్రారంభమైంది. ఉదయం నుంచి రాత్రి వరకు కేవలం 6.6 శాతమే పంపిణీ చేశారు. చౌక దుకాణాల్లో బియ్యం మాత్రం ఇవ్వడంతో కార్డుదారులు రేషన్ తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. మరికొన్ని చోట్ల డీలర్ల మార్పులు, చేర్పుల సమస్యల కారణంగా బియ్యం సకాలంలో పేదలకు అందని పరిస్థితి నెలకొంది. రేషన్ పంపిణీలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా 13వ స్థానంలో నిలిచింది.

విద్యుత్ అంతరాయాలను తగ్గించాలి

–ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు




వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈ మునిచంద్ర, ట్రాన్స్‌కో అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో విద్యుత్ అంతరాయాలను తగ్గించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదేశించారు. గురువారం తిరుపతి ఎస్ఈ కార్యాలయం నుంచి ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సెక్షన్ల వారీగా అంతరాయాలను తగ్గించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఓవర్ లోడు, విద్యుత్‌చౌర్యం ఇత్యాది వాటి వల్ల అంతరాయం కలుగుతోందని, విద్యుత్ చౌర్యంపై మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ నెల రెండోవారం లోపు సెక్షన్ల వారీగా అంతరాయాలకు గల కారణాలపై నివేదిక సమర్పించాలన్నారు. 8వ తేదీ లోపు విద్యుత్ రీడింగ్ తీయడం పూర్తి చేయాలన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, హరి, డీఈలు పద్మనాభపిళ్లై, శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఈలు, సబ్‌ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రణాళికలు

కడా డైరెక్టర్ వికాస్ మర్మత్



అధికారులతో సమీక్షిస్తున్న కడా పీడీ

గుడుపల్లె: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. గురువారం స్థానిక శ్రీశక్తి భవనంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. గ్రామాలలో వైద్యం, విద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆదాయ వనరులను సమకూర్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలు నివేదించే సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

2020వ సంవత్సరంలో..

నాలుగు సంవత్సరాల క్రితం విలేకరుల సమావేశంలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ..'' నిన్నా.. మొన్న చూశాను ఆ విలేజ్ వాలంటీర్లు...వాళ్లతో పెద్ద ప్రమాదం వచ్చి పడింది.. ఒక అమ్మాయిని వాంఛ తీర్చమని బలవంతం చేశారు. చేయను అన్నందుకు ఆ అమ్మాయిని కొట్టడం..ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి రావడం.. ఎవరడిగారు వాలంటీర్లను నియమించమని?.. వాలంటీర్ల వల్ల ఏమైనా లాభం ఉందా?.. ఏం ఉద్యోగం అది? గోనెసంచులు మోసే ఉద్యోగమా?.. బియ్యం సంచులు మోసే ఉద్యోగం..మేము పెద్ద ఎత్తున ఇచ్చేశామని గొప్పలు (అప్పట్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి).. వాలంటీర్లు ఎప్పుడంటే అప్పుడు ఇళ్లకు వెళ్లడం.. ఇబ్బందులు పెట్టడం. ఉదయం పూట మగవాళ్లు ఉండరు..వాలంటీర్లు వెళ్లి తలుపులు కొట్టడం. చూస్తే ఎంతో బాధ...ఆవేశం వస్తుంది..''
అని వాలంటీర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

2023వ సంవత్సరంలో..

''ఇంటింటికీ వాలంటీర్లు వస్తున్నారు...వాలంటీర్లు రాజకీయం చేయద్దండి. చెప్పినమాట వినకపోతే మా ఆడబిడ్డలు వాలంటీర్లను ఊరికే వదలరు.. అంతు చూస్తారు.. అది ఇస్తాం...ఇది ఇస్తామని వాలంటీర్లు ఇంట్లోపలికి వస్తున్నారు.. ఇంట్లోపలికి వచ్చేందుకు వాలంటీర్లు ఎవరు? వివరాలను అడుగుతున్నారు. ఎలాంటి వివరాలంటే మీ అయనకు వేరే సంబంధాలు ఏమైనా ఉన్నాయా? అంటే కొంపలను కూల్చే మార్గం . చెప్పుతో కొట్టేవారు లేకపోతే సరి''

ఎన్నికలకు ముందు మాట మార్చేసిన చంద్రబాబు

''వాలంటీర్ల ఉద్యోగాలు తీసెయ్యం.. వాలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తామని మరొకసారి మీ అందరికీ హామీ ఇస్తున్నా.. రూ.5 వేలు కాదు.. మీకు రాబోయే రోజుల్లో 10 వేల రూపాయలు పారితోషికం ఇచ్చే బాధ్యత మాది.. మీలో సమర్థత ఉంది.. తెలివి తేటలు ఉన్నాయ్. ఇది ఎంట్రీ పాయింట్ మాత్రమే''



కూటమి కక్ష

- వలంటీర్లపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు
- అధికారంలోకి వస్తే రూ.10 వేలు ఇస్తామన్న హామీ తుస్స్‌స్..!
- విధులు నిల్..జీతాలు ఇవ్వకుండా వేధింపులు
- మండిపడుతున్న వలంటీర్లు, ప్రజలు

వలంటీర్లను ఒకప్పుడు సంఘ విద్రోహ శక్తులు అని వారిపై విషం చిమ్మిన చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్లేటు ఫిరాయించారు. ప్రభుత్వ సేవలను ప్రజల దరికి చేర్చడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని గ్రహించి వారినీ ప్రసన్నం చేసుకునేందుకు మాట మార్చారు. వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని తొలుత ప్రకటించిన ఆయన..తాము అధికారంలోకి వస్తే వలంటీర్లు మరింత గౌరవప్రదంగా జీవించేందుకు చర్యలు తీసుకుంటామని, గౌరవ వేతనం రూ.10వేలు ఇస్తామని అట్టహాసంగా ప్రకటించారు. సీన్ కట్ చేస్తే– అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావొస్తున్నా ఆ ఊసే లేదు. వలంటీర్లకు ఏ విధులూ అప్పగించడం లేదు; వారికీ గౌరవ వేతనాలూ ఇవ్వడం లేదు. దీంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.

చిత్తూరు కలెక్టరేట్ : ఏరు దాటేదాక ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న– అనే సామెత నారా చంద్రబాబు నాయుడు వ్యవహార శైలికి అతికినట్టు సరిపోతుందనడంలో అతిశయోక్తి లేదు. దేశంలోనే రాజకీయాల్లో తానో మోస్ట్ సీనియర్‌నని, విలువలకు ప్రాధాన్యత ఇచ్చే వాడినంటూ తనకు తాను గొప్పలు చెప్పుకుంటున్నా వ్యవహార శైలిలో ఆ 'రాజకీయ' విలువలేమిటో ప్రజలందరికీ ఎరుకే. అధికారమే పరమావధిగా ఇచ్చిన హామీలను ఆ తర్వాత తుంగలో తొక్కడం ముఖ్యమంత్రి అయిన ప్రతిసారీ ప్రజలకు అనుభవపూర్వకమే. సూపర్ సిక్స్ హామీలతో అన్ని వర్గాల ప్రజలను ఊదరగొట్టిన బాబు ఇప్పుడు హామీలను నెరవేర్చకుండా అదరగొడుతున్నారు, బెదరగొడుతున్నారు! అలాగే వలంటీర్లను అందలమెక్కిస్తామన్న ఆయన చివరకు అధఃపాతాళంలో పడేశారు. ఎన్నికలకు ముందు టీడీపీ–జనసేన–బీజేపీ నేతలు చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక నాలుక మడత పెట్టడంతో బావురుమంటున్న వారి జాబితాలోకి వలంటీర్లు చేరిపోయారు. కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలు...విధుల్లోకి తీసుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తున్న నాన్చుడు ధోరణికి తమ భవిష్యత్తు అనిశ్చితితో పడిందని ఆందోళన చెందుతున్నారు.





కరోనా సమయంలో చిత్తూరులోని 39వ వార్డు, రాంనగర్ కాలనీలో సేవలు అందిస్తున్న వలంటీర్లు (ఫైల్)



చెన్నై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధనలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

ఎలాంటి పనులూ చెప్పడం లేదు

కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలంటీర్లకు ఎలాంటి పనులు, బాధ్యతలు అప్పజెప్పడం లేదు. జీతం ఇవ్వడం లేదు. పొమ్మనక పొగబెట్టే ధోరణిలో వ్యవహరిస్తుండడంతో వారికి దిక్కు తోచడం లేదు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలను వలంటీర్లు ప్రజలకు చేరువ చేయడంలో కీలకపాత్ర పోషించారు. ప్రతి నెలా ఒకటవ తేదీ ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్లు అందజేసేవారు. అనారోగ్యం బారిన పడి ఇతర రాష్ట్రాల్లో చికిత్స పొందుతున్న వృద్ధుల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాగే కరోనా మహమ్మారి విలయతాండవం చేసిన 2020, 2021 సంవత్సరాల్లో ప్రాణాలను సైతం లెక్క చెయ్యకుండా ఎంతో మంది ప్రజలకు తోడుగా నిలిచి వేలాది మంది ప్రాణాలను కాపాడారు. వీటిని దృష్టిలో ఉంచుకునైనా తమ సేవలను కొనసాగించాలని, తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని వలంటీర్ల సంఘాలు ప్రస్తుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి

జిల్లాలో వలంటీర్ల వివరాలు

నియోజకవర్గం	గ్రామ, వార్డు సచివాలయాలు	మొత్తం వలంటీర్లు
చిత్తూరు	77	1208
జీడీనెల్లూరు	89	1292
కుప్పం	93	1342
నగరి	53	742
పలమనేరు	125	1992
పుంగనూరు	77	1284
పూతలపట్టు	98	1360
మొత్తం	612	9220

జిల్లా వ్యాప్తంగా ఎన్నికలకు ముందు కొందరు రాజీనామా

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 31 మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గ్రామ, వార్డు వలంటీర్లు విధులు నిర్వహించేవారు. జిల్లాలో 612 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. ఇందులో 9,346 మంది వలంటీర్లకు గాను 9,220 మంది విధులు నిర్వహించేవారు. వీరిలో 4,720 మంది ఎన్నికలకు ముందు మే నెలలో రాజీనామాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 4500 మంది గ్రామ, వార్డు వలంటీర్లు ఇప్పటికీ కొనసాగుతున్నారు. ఎన్నికలకు ముందు వలంటీర్లకు మేలు చేస్తామన్న చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వచ్చాక వారి ఊసే ఎత్తడం లేదు.

అగమ్యగోచరం

జిల్లాలోని వలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావొస్తున్నా దీనిపై అతీగతీ లేదు. తమకు న్యాయం చేయాలని పలువురు వలంటీర్లు టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలను, ఎంపీలను, కలెక్టర్‌ను కలిసి తమ గోడు ఇప్పటికే నివేదించారు. అయినా ఫలితం శూన్యం. మరోవైపు వలంటీర్లకు 2 నెలల గౌరవ వేతనాలు ఇప్పటికీ ఇవ్వలేదు. బిల్లులు పెట్టేశాం...పైనుంచి ఆమోదం రావాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మభ్య పెడుతున్నారని, సీఎం హామీ నెరవేర్చడం లేదని వలంటీర్లు గగ్గోలు పెడుతున్నారు.

మమ్మల్ని పక్కన పెట్టేశారు



ఎన్నికలకు ముందు వలంటీర్లను కొనసాగిస్తామని చెప్పారు. నెలకు రూ.10 వేలు ఇస్తామని ఆశపెట్టారు. ఇప్పుడు మమ్మల్ని పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో పేదలకు సేవ చేయడమే మా తప్పుగా భావిస్తున్నారేమో. ఇప్పటికైనా ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

–మనీషా, వలంటీర్, కలగటూరు, గంగవరం

విధుల్లేవు.. వేతనాలు రావు



కూటమి అధికారంలోకి వస్తే తప్పకుండా వలంటీర్లను కొనసాగిస్తామని చంద్రబాబు అన్నారు. కానీ ఇంతవరకు ఎలాంటి నిర్ణయం లేదు. నెలకు రూ.10 వేలు అని మాటిచ్చారు. మమ్మల్ని విధుల్లోకి తీసుకుని వారు ఎలాగైనా వాడుకోవచ్చు. కానీ ఈ ప్రభుత్వం ఏమి చేస్తుందో దిక్కు తెలియడం లేదు. అంతా అయోమయంగా ఉంది. ఏం చేయాలో దిక్కు తోచడం లేదు.

–మోహన్, చౌడేపల్లె, వీ.కోట మండలం

మమ్మల్ని పట్టించుకోవడం లేదు



ఎన్నికలకు ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా నెరవేర్చాలి. మేము గత ఐదేళ్లుగా ప్రజలకు సేవలందించాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావొస్తోంది. మా గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మండల అధికారులను అడిగితే తమకేమీ తెలియదని అంటున్నారు. జీతం కూడా ఇంకా ఇవ్వనేలేదు.

– శివకుమార్, వలంటీర్

చాలా ఇబ్బందిగా ఉంది



ప్రభుత్వం మా గురించి పట్టించుకుంటుందేమోనని రెండు నెలలుగా ఎదురు చూస్తున్నాం. మాకు ఎలాంటి పనులను అధికారులు చెప్పడం లేదు. మా పరిస్థితి ఏమిటని ప్రజాప్రతినిధులను అడిగితే వాళ్లు సమాధానం చెప్పడం లేదు. ఎన్నికలకు ముందు జీతం రూ.10 వేలు ఇస్తామన్నారు. వలంటీర్లకు ఎంతో తెలివితేటలు, సమర్థత ఉందని ఎన్నికల ప్రచారాల్లో చెప్పారు. ఇప్పుడేమో ఎవ్వరూ మమ్మల్ని పట్టించుకోవడం లేదు. – సాగర్, వలంటీర్

చాలా బాధ వేస్తోంది



గతంలో ప్రతి నెలా ఒకటవ తేదీ ఉదయం ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేసేవాణ్ని. ఇప్పుడేమో మమ్మల్ని దూరం పెట్టారు. అన్ని సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. మాకు ఎలాంటి పనులు చెప్పడం లేదు. చాలా బాధ వేస్తోంది. ఇంకెన్ని నెలలు ఇలా ఇట్లా ఉండాలో అర్థం కావడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాకు న్యాయం చేయాలి.

– వెంకటేశ్, వలంటీర్

ఖాకీల్లో 'కుల'కలం..!

- పేర్ల చివరన మూడక్షరాలుంటే ఉన్నత పోస్టింగ్
- ఎస్సీ, బీసీ, రెడ్డి సామాజిక అధికారులకు వీఆర్
- ఉమ్మడి జిల్లా సీఐల బదిలీల్లో కూటమి 'మార్కు'
- డీఎస్పీ బదిలీల్లోనూ ఇదే వైఖరి
- నేతల కసరత్తుపై ముందే హెచ్చరించిన 'సాక్షి'

చిత్తూరు అర్బన్: అంతా ఊహించినట్లే జరుగుతోంది. శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసుశాఖపై 'పచ్చ'ముద్ర వేస్తున్నారు. తాను చెప్పింది చెప్పినట్లు చేసే అధికారులను ఏరికోరి తెచ్చుకుంటున్నారు. అందులోనూ పేర్ల చివరన కులానికి సంబంధించి ఉన్న మూడు అక్షరాలే ప్రామాణికంగా పోలీసుశాఖలో అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం జరిగిన డీఎస్పీల బదిలీల్లో 'రెడ్డి' అని ఉన్న నలుగురికి పోస్టింగ్ ఇవ్వకుండా చేశారు. ముస్లిం, ఎస్సీ అధికారులు సబ్ డివిజన్ చేయడానికి పనికిరారు అన్నట్లు పోస్టింగ్ ఇవ్వకుండా, పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పేర్ల చివరన మూడక్షరాలు ఉన్న వారిని అందలం ఎక్కించారు. పోలీసుశాఖలో పడ్డ కూటమి మార్కు బదిలీలు.. ప్రజల మానప్రాణాలను కాపాడి శాంతిభద్రతల పర్యవేక్షణలో ఎలాంటి ప్రభావం చూపుతుందో కాలమే సమాధానం చెబుతుంది.

వాళ్లకే పెద్ద పీట

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమోషీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇందులో ఓ సామాజికవర్గ అధికారులకు పెద్దపీట వేసిన ప్రభుత్వం.. ఎస్సీ, బీసీ, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులను పూర్తిగా పక్కన పెట్టింది. వీరికి పోస్టింగులు ఇవ్వకుండా వేకెంట్ రిజర్వు (వీఆర్)లో ఉంచుతూ ఆదేశాలు జారీ చేసింది. కూటమి ప్రభుత్వంలో పోలీసుశాఖలోనూ సామాజికవర్గాలను చూస్తూ జరిగిన ఈ బదిలీలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. దీనికితోడు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పేర్ల చివరన మూడు అక్షరాలున్న ఇంకా పది మంది వరకు డీఎస్పీలను తెప్పించుకోవడానికి కూడా కసరత్తు చేస్తున్నారనే చర్చ నడుస్తోంది. అలాగే మరో 22 మంది సీఐల బదిలీల జాబితా మరో రెండు రోజుల్లో వెలువడనుంది. ఈ మొత్తం వ్యవహారంలో గతంలో జిల్లాలో పనిచేసి, ఇప్పుడు ఉన్నత పోస్టింగ్ దక్కించుకున్న ఓ డీఎస్పీ ఉన్నట్లు పోలీసుశాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి.



వారికే 'అగ్ర'తాంబూలం

పోలీసుశాఖలో కుల సమీకరణంపై 'సాక్షి'లో ప్రచురితమైన వార్త



సీఐల బదిలీ ఇలా..

అనంతపురం డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎం.సుబ్రమణ్యంను తిరుపతి డీసీఆర్‌బీకు, తిరుపతి ఏసీబీలో పనిచేస్తున్న డి.సునీల్‌కుమార్‌ను తిరుచానూరు, తిరుచానూరులో పనిచేస్తున్న బి.శ్రీకాంత్‌రెడ్డిని తిరుపతి వీఆర్, తిరుపతి పోలీసు శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న కె.రాజగోపాల్ నాయుడుని హిందుపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, తిరుపతి సీఐడిలో పనిచేస్తున్న సి.అంజనేయులను హిందూపురం రూరల్, చిత్తూరు డీటీసీలో పనిచేస్తున్న బి.శ్రీనివాసరావును చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్, చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్‌లో పనిచేస్తున్న ఎస్.కుల్లాయప్పను చిత్తూరు వీఆర్, కర్నూలు వీఆర్‌లో ఉన్న ఎం.సూర్యనారాయణను కల్లూరు, కల్లూరులో ఉన్న కట్టి శ్రీనివాసులును చిత్తూరు వీఆర్, చిత్తూరు డీటీఆర్‌బీలో పనిచేస్తున్న ఎం.జయరామయ్యను చిత్తూరు వన్‌టౌన్, చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్.విశ్వనాథరెడ్డిని చిత్తూరు వీఆర్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులిచ్చారు. కాగా వీఆర్‌కు తీసుకుంటూ పోస్టింగులు ఇవ్వనివారిలో ఇద్దరు రెడ్డి, ఓ ఎస్సీ, ఓ బీసీ అధికారులు ఉండటం గమనార్హం! ఆదాయం ఉన్న పోస్టులు దక్కించుకున్న వారిలో పేర్ల చివరన మూడక్షరాలు ఉన్నవారు ఆరుగురు ఉన్నారు. ఇంకా జిల్లాలో దాదాపు 17 మంది వరకు సీఐలను బదిలీ చేయడానికి కూటమి నేతలు జాబితా సిద్ధం చేసి, ప్రభుత్వ పెద్దలకు పంపే పనిలో ఉన్నారు.

నేడు ఉద్యానవన శాఖ అధికారుల సమావేశం

చిత్తూరు అగ్రికల్చర్: ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది సమీక్ష శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఆ శాఖ డీడీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఉద్యాన పంటల సాగు వార్షిక ప్రణాళికలపై చర్చిస్తామని, అన్ని మండలాల ఉద్యాన అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులకు.. వ్యవసాయ శాఖ అధికారుల జిల్లాస్థాయి సమీక్ష శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి మురళీకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

చిన్నారుల పరిరక్షణే ధ్యేయం

చిత్తూరు అర్బన్: చిన్నారుల భవిష్యత్తు పరిరక్షణే ధ్యేయంగా ముందడుగు వేస్తామని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. చిత్తూరు నగరంలో సాయుధ దళం కార్యాలయంలో గురువారం సురక్ష, అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని 200 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. పిల్లల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యమని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆరిఫుల్లా, నాగేశ్వరరావు, సుబ్బరాజు, సురక్ష ఆస్పత్రి వైద్యుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు విరాళం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని గోసంరక్షణ ట్రస్ట్‌కు గురువారం విజయనగరానికి చెందిన రెడ్డి నాగ భూషణం రూ. లక్ష విరాళాన్ని అధికారులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది విష్ణు పాల్గొన్నారు.

పింఛన్ల కోత

పింఛన్...ఏ ఆసరాలేని పండుటాకులు, వితంతువులు, దివ్యాంగుల జీవనానికి భరోసా. దీనిపై ఆధారపడిన వారు జిల్లా వ్యాప్తంగా ఎందరో ఉన్నారు. 2019లో వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే టీడీపీ అందజేసిన వాటికంటే ఎక్కువ మందికి పింఛన్లు మంజూరు చేసింది. ఎలాంటి కోతలు విధించలేదు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పింఛన్లకు కోతలు పెడుతుండడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

- జిల్లాలో 634 మంది పింఛన్లు కట్!
- ఆందోళన చెందుతున్న పింఛనుదారులు
- కాకి లెక్కలతో డీఆర్‌డీఏ అధికారుల కహానీ



జిల్లా వివరాలు
గత నెల మంజూరు చేసిన పింఛన్లు 2,71,253
ప్రస్తుతం మంజూరు చేసిన పింఛన్లు: 2,70,619
తొలగించిన పింఛన్లు: 634

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నెల పింఛన్ల పంపిణీలో కుల రాజకీయం మొదలుపెట్టారు. జిల్లాలోని నగరి, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు, కుప్పం ప్రాంతాలలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పలువురికీ పింఛన్లు ఇవ్వరాదని అధికారులకు హుకుం జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని స్థానిక టీడీపీ నేతలు కుల రాజకీయాలు చేసి జూలైలో పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారు. అలాంటి ఘటనలు కలెక్టర్ దృష్టికి వచ్చాక పింఛన్లు పంపిణీ చేయించారు. ప్రస్తుతం ఆగస్టు నెల పింఛన్ల పంపిణీలోనూ అదే కుట్రను అమలు చేస్తున్నారు.

634 పింఛన్ల కోత

జిల్లా వ్యాప్తంగా ఆగస్టు నెల పింఛన్ల పంపిణీలో 634 మంది పింఛన్లు తొలగించారు. దీనిపై పలువురు అధికారులను ప్రశ్నిస్తే తొలగించిన పింఛన్లన్నీ మృతి చెందిన వారివని చెప్పుకొచ్చారు. జూలైలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,71,253 మందికి పింఛన్లు అందజేశారు. ప్రస్తుతం ఆగస్టు పింఛన్ల పంపిణీలో 2,70,619 మందికి మంజూరు చేశారు. మిగిలిన 634 మందికి కోత పెట్టారు. వాస్తవంగా జిల్లా వ్యాప్తంగా జూలైలో 100 మంది కూడా మృతి చెందలేదని వైద్యశాఖ అధికారులు చెప్పడం గమనించతగ్గ అంశం. అలాంటి పరిస్థితుల్లో ఒకే నెలలో 634 మంది మృతి చెందారని పింఛన్లు తొలగించడం పలు అనుమానాలకు తావిస్తోంది. వచ్చే నెల ఇంకెంత మంది పింఛన్లకు ఎసరు పెడతారోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

కాకిలెక్కలతో ఉన్నతాధికారులకు మోసం

పింఛన్ల పంపిణీకి సంబంధించి కాకిలెక్కలను సృష్టించి ఉన్నతాధికారులను డీఆర్‌డీఏ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆగస్టుకు సంబంధించి 2,70,619 మందికి రాష్ట్ర అధికారులు పింఛన్ల సొమ్ము మంజూరు చేశారు. అయితే డీఆర్‌డీఏ అధికారులు 2,71,422 మందికి ఆగస్టులో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్‌కు నివేదికలిచ్చి బురిడీ కొట్టించారు. వాస్తవంగా రాష్ట్ర అధికారులు జారీచేసిన పింఛన్ల పంపిణీ నివేదికల్లో చిత్తూరు జిల్లాకు సంబంధించి 2,70,619 మందికి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అందులో మొదటి రోజు 2,64,401 మందికి పంపిణీ చేశారు. మిగిలిన 6218 మందికి పంపిణీ చేయలేకపోయారు.



ఉన్నతాధికారులకు డీఆర్‌డీఏ అధికారులు ఇచ్చిన పింఛన్ల తప్పుల తడక నివేదిక

ప్రజాస్వామ్యానికి కూటమి ప్రభుత్వం ఘోరీ

– మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి కల్చరల్: అధికారంలోకి వచ్చింది మొదలు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడమే కాక, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ.. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి ఘోరీ కట్టిందని మాజీ ఉప ముఖ్యమంత్రి కె. నారాయణస్వామి మండిపడ్డారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, దీన్ని ఆసరా చేసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యం అంటారా అని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. మదనపల్లి ఆర్డీవో ఆఫీసులో రికార్డులు తగులబెట్టి.. ఆ నెపం తమపై నెట్టారన్నారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పేదలను అశల పల్లకిలో ఊరేగించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ‘సూపర్ సిక్స్’ అమలు చేయలేనని అసెంబ్లీ సాక్షిగా చేతులెత్తేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనంగా నిలుస్తుందని ధ్వజమెత్తారు. నిరుపేద వర్గాలు చదువు ద్వారా సమాజంలో ఉన్నత స్థానంలో ఉండాలనే కాంక్షతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారని వివరించారు. అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం జగన్ నిరంతరం కృషి చేశారన్నారు. పేదలకు సొంతింటి కలను వేర్చడం, ఉన్నత విద్యతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్యశ్రీ పథకాలతో పాటు నవరత్నాలను అమలు చేసి పేదల జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు జగన్ అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. చంద్రబాబు ప్రజలను ఏమార్చి.. పలు రకాల మోసాలకు పాల్పడి అధికారంలోకి వచ్చారని అన్నారు. బాబు సామాజిక వర్గాన్ని కాపాడుకోవడానికే అమరావతి పాట పాడుతున్నారని అపహాస్యం చేశారు.

పోలీస్ కస్టడీకి ఏటీఎం చోరీ నిందితుడు

గుడిపాల: ఏటీఎం చోరీ చేసిన కేసులో ఓ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 15 రోజుల క్రితమే హరియాణా రాష్ట్రానికి చెందిన ప్రధాన నిందితుడి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడిని విచారణ చేసేందుకు కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ వేశారు. న్యాయమూర్తి దీనికి ఆమోదించడంతో గురువారం పోలీస్‌స్టేషన్‌కు అతడిని తీసుకువచ్చారు. ఏటీఎం చోరీలో ఎంతమంది పాల్గొన్నారు? ఎలా దొంగతనం చేశారు? ఇంకా ఎక్కడైనా దొంగతనాలకు పాల్పడ్డారా? అనే దానిపై వివరాలు సేకరించారు.

ఈ మృతుడు ఎవరో..?



లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శాంతిపురం: లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన కుప్పం–పలమనేరు జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. గురువారం రాళ్లబూదుగూరు ఎస్‌ఐ ఐ.నరేష్ తెలిపిన వివరాలు.. తమిళనాడు నుంచి వి.కోట వైపు వెళ్తున్న లారీ మండలంలోని గుండిశెట్టిపల్లె వద్ద రోడ్డు దాటుతున్న 45–50 ఏళ్ల వ్యక్తిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, లేదా బంధువులు, ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

భద్రతా ప్రమాణాలపై నివేదిక

- వరుస సమీక్షల్లో అధికారులకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల భద్రతా ప్రమాణాలను పరిశీలించి నివేదికను సమర్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో కలెక్టర్ వరుస సమీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 8 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో భద్రతను పరిశీలించేందుకు ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో, అగ్నిమాపక శాఖల అధికారులతో బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ బృందాలు ఆయా కార్యాలయాల్లో విద్యుత్, రికార్డుల భద్రత, నూతన భవనాల ఆవశ్యకత.. తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

నైపుణ్యాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన

జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వృత్తి నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నిరుద్యోగ యువత కోరుకున్న రంగంలో రాణించేలా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని చెప్పారు. జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇప్పించి, వారు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, ఉపాధి కల్పనా అధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ గృహాలు పూర్తి చేయండి

జిల్లాలో పెండింగ్‌లో పక్కా గృహాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ఇళ్ల పనులను అక్టోబర్ 30వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నిర్మాణదశలో ఉన్న 22,125 గృహాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లాకు 77,366 మంజూరు కాగా అందులో 46,302 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పద్మనాభం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ ‘పచ్చ’పాతం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉన్నతాధికారులు సైతం ‘పచ్చ’బ్రాండ్ అంబాసిడర్లుగా అవతారం ఎత్తారు. వారి సేవలో మరింత ‘బాధ్యతాయుతం’గా తరించాలనే తహతహతో ప్రజాస్వామ్య విలువల్ని కాలరాస్తున్నారు. ‘పచ్చ’పాత వైఖరితో వివాదాలు మూటకట్టుకున్నారు. దీనికి స్టాండింగ్ కమిటీ ఎన్నికలే దీనికి నిలువుటద్దం పట్టాయి.

- స్టాండింగ్ కమిటీ పోలింగ్‌లో ‘అతి’క్రమణ
- బ్యాలెట్ పేపర్లను ముందుగానే ‘జంప్ జిలానీల’కు ఇచ్చిన ఇచ్చిన వైనం
- అక్రమాలు నిరసిస్తూ పోలింగ్‌ను బహిష్కరించి వైఎస్సార్ సీపీ నేతల ధర్నా
- కమిషనర్ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు.. ఆమెపై వేటు వేయాలని వినతి
- ఇప్పటికే డిప్యుటేషన్ పూర్తి
- మాతృశాఖకు సరెండర్ చేయాలని డిమాండ్



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విజయానందరెడ్డి, కార్పొరేటర్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఎన్నికల తీరును అపహాస్యం చేశారు. పారదర్శకంగా నిర్వహించాల్సిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలను వివాదాస్పదం చేశారు. పోలింగ్ కేంద్రంలో ఇవ్వాల్సిన బ్యాలెట్ పత్రాలను రహస్య గదుల్లో ఇచ్చి, టీడీపీ నాయకులకు పూర్తిగా అనుకూలంగా వ్యవహరించి, పోలింగ్ ప్రక్రియను అపహాస్యం చేశారు. దీనిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భగ్గుమన్నారు. పోలింగ్‌ను బహిష్కరించారు. కమిషనర్ బాగోతంపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని.. స్టాండింగ్ కమిటీ ఎన్నికను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

డీఎంఏకు ఫిర్యాదు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల వ్యవహారంపై విజయానందరెడ్డి, చంద్రశేఖర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కమిషనర్ అరుణను సస్పెండ్ చేయాలని, స్టాండింగ్ కమిటీ ఎన్నికను మళ్లీ నిర్వహించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రజల చేత ఎన్నుకోబడిన కార్పొరేటర్లకే స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించనపుడు ఈ ప్రభుత్వ హయంలో సామాన్యుల పరిస్థితి ఏమిటీ ఇట్టే బోధపడుతుందన్నారు. అరుణ తనకు ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడికి అనుకూలంగా మారిపోతారని దుయ్యబట్టారు. దీనికి బదులు కూటమి నేతలకు బ్యాలెట్లను ఇంటికే ఇచ్చి పంపేయవచ్చన్నారు. అసలు పంచాయతీరాజ్ శాఖకు చెందిన అరుణ డెప్యుటేషన్ గడువు చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో గత నెల 9వ తేదీనే తీరిపోయిందన్నారు. ప్రభుత్వం నుంచి ఆమెకు ఎలాంటి కొనసాగింపు ఉత్తర్వులు రాకపోవడంతో, ఆమె పంచాయతీరాజ్‌లో రిపోర్టు చేయాల్సింది పోయి చిత్తూరులో కొనసాగుతుండటం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. అంతేకాకుండా కమిషనర్ ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్ కూడా చెల్లుబాటు కాదని, దీనిపై అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. కమిషనర్ వ్యవహరించిన తీరుపై రాష్ట్ర మునిసిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరినారాయణన్‌కు సైతం ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. తమకున్న సంఖ్యాబలంతో కౌన్సిల్ అత్యవసర సమావేశానికి నోటీసులు ఇచ్చి సెక్షన్ 104 ప్రకారం కమిషనర్‌ను ఆమె మాతృశాఖకు సరెండర్ చేయడానికి ప్రతిపాదిస్తామన్నారు.

ఏకపక్షంగా కమిషనర్ శైలి

చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ ఆది నుంచి వివాదాల మధ్యే కొనసాగింది. ఐదుగురు సభ్యులను ఎన్నుకోవడానికి గత నెల 6న నోటిఫికేషన్ ఇచ్చినట్టు చెబుతున్న కమిషనర్, మీడియాకు చెప్పక పోవడం గమనార్హం! అంతేకాకుండా టీడీపీ సభ్యులను ఏకగ్రీవం చేయడమే లక్ష్యంగా నోటిఫికేషన్ జారీ చేశారని దుమారం కూడా రేగింది. అయితే ఐదు స్థానాలకు ఎనిమిది మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేయడం, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు నామినేషన్లను ఉపసంహరించుకోకపోవడంతో పోలింగ్ అనివార్యమైంది. గతనెల 26న నిర్వహించాల్సిన పోలింగ్‌ను ఆగస్టు 1వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కార్పొరేటర్లకు సమాచారం ఇచ్చిన కమిషనర్, కారణం మాత్రం చెప్పలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ ఆక్షేపించారు. కేవలం టీడీపీ, జనసేన అభ్యర్థుల గెలుపుకోసమే కమిషనర్ పోలింగ్‌లో అడ్డదారులు తొక్కారని ఆయన ఆరోపించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణలో తప్పులు దొర్లడం, మోడల్ బ్యాలెట్ పత్రాలను కార్పొరేటర్లకు ఇవ్వడంలో అలసత్వం చూపడం లాంటి పొరపాట్లను కమిషనర్ ఏమాత్రం లెక్క చేయలేకపోవడం ఆమె వ్యవహారశైలికి నిదర్శనంగా మారింది.

పోలింగ్‌లో వివాదం

చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు సంబంధించి పోలింగ్‌లో ఓటర్లుగా ఉన్న కార్పొరేటర్లకు పోలింగ్ కేంద్రంలోనే బ్యాలెట్లు ఇవ్వాలి. ఆ సమయంలో బ్యాలెట్ పత్రం అనుబంధంలో ఓటర్ల సంతకాలు తీసుకోవాలి. కానీ కమిషనర్ అలా చేయకుండా వైఎస్సార్‌సీపీ నుంచి ఇటీవల టీడీపీ, జనసేనలోకి చేరిన కార్పొరేటర్లకు ముందుగానే బ్యాలెట్ పత్రాలు ఇచ్చేశారని కార్పొరేషన్ కౌన్సిల్ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ చంద్రశేఖర్ గుర్తించారు. ఓట్లు వేయడానికి వచ్చిన కార్పొరేటర్లు అందరినీ పోలింగ్ కేంద్రంలోకి అనుమతించి, అందరి ఎదుటే బ్యాలెట్ ఇవ్వాల్సింది పోయి.. రహస్య గదుల్లో బ్యాలెట్ ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించినా కమిషనర్ నుంచి ఎలాంటి సమాధానం లేదు. ఒక కార్పొరేటర్‌కు ఇచ్చిన బ్యాలెట్‌లో సీరియల్ నంబర్ 33గా ఉంది. అంటే వైఎస్సార్‌సీపీ తరపున 26 మంది కార్పొరేటర్లు ఉంటే 33వ నంబరు ఎలా వెళ్లిందని చంద్రశేఖర్ నిలదీశారు. దీనిపై అధికారులు నీళ్లు నమలడంతో పోలింగ్‌ను బహిష్కరించారు. కమిషనర్ ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డితో కలిసి పార్టీ కార్పొరేటర్లు ధర్నా చేశారు. అయినాసరే ఎన్నికల్లో కూటమికి చెందిన రాజేష్‌కుమార్‌రెడ్డి, శశికుమార్, సుష్మ, అశోకన్, నిర్మల ఎన్నికయ్యారని కమిషనర్ ప్రకటించడం వివాదాస్పదమైంది.

పంటలపై ఏనుగుల దాడి



ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లె పంచాయతీ అటవీ సరిహద్దు గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె, పెనుగొలకల, పెద్దకాప్పల్లె, ముదిరెడ్డిపల్లె, బందార్లపల్లిపల్లె, జిట్టంవారిపల్లె, గౌరీనగర్, ఆకులవారిపల్లె గ్రామ రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. బుధవారం రాత్రి పేటూరు ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు పెనుగొలకల ఈశ్వరమ్మ, చిట్టి తదితరుల వరి నారుమడులు, బీన్స్, కాలీఫ్లవర్, టమాట పంటను తొక్కి నాశనం చేశాయి. మామిడి కొమ్మలను విరిచేశాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలను చూసి కన్నీరుమున్నీరయ్యారు.

మహిళా–శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా మహిళా–శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ శాఖ పీడీ నాగశైలజ కోరారు. ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కో–ఆర్డినేటర్ (జనరల్), జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్(జనరల్), బంగారుపాళ్యం బ్లాక్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఎస్సీ), పలమనేరు బ్లాక్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఓసీ), బైరెడ్డిపల్లె బ్లాక్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్(బీసీ–ఏ), శాంతిపురం బ్లాక్ ప్రాజెక్ట్ కో– ఆర్డినేటర్(ఓసీ), కుప్పం బ్లాక్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్(ఎస్టీ), పుంగనూరు బ్లాక్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్(ఓసీ) పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే జిల్లా బాలల పరిరక్షణ విభాగం లో ప్రొటెక్షన్ ఆఫీసర్ 1, కౌన్సిలర్ 1, సోషల్ వర్కర్ 1, అకౌంటెంట్ 1, డేటా అనలిస్ట్ 1, ఔట్‌రీచ్ వర్కర్ 1, ఆయాలు 2, పార్ట్ టైం డాక్టర్ 1, వన్ స్టాప్ సఖి కేంద్రంలో ఖాళీగా ఉన్న సెంటర్ అడ్మినిస్ట్రేటర్ 1, పారాలీగల్ పర్సనల్ 1, పారామెడికల్ పర్సనల్ 1, సోషల్ కౌన్సెలర్ 1, ఆఫీస్ అసిస్టెంట్ 1, మల్టీ పర్పస్ స్టాఫ్ 2, సెక్యూరిటీ గార్డులు 2 పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. సఖీ కేంద్రంలో పోస్టులకు అర్హులైన మహిళలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను www. chittoor. ap. gov. in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. దరఖాస్తుకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతచేసి ఈ నెల 3నుంచి 10వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని మహిళా–శిశు సంక్షేమ కార్యాలయంలో అందజేయాలన్నారు.